క్లుప్తంగా

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం

ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు

శావల్యాపురం: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని పిచికలపాలెం గ్రామంలో అనధికారికంగా బెల్ట్‌షాపు నడుపుతున్న గ్రామానికి చెందిన వై.శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెల్లడించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు గ్రామాల్లో అనధికారకంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరంగా అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో పోలీసులు ఉంచామన్నారు. ప్రభుత్వ మద్యం షాపులలో ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మరాదన్నారు. అనంతరం 12 బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొత్త సొలస విద్యార్థుల ఘన విజయం

అంతర్జాతీయ రంగోత్సవంలో మెరిసిన ప్రతిభ



యడ్లపాడు: మండలానికి చెందిన కొత్తసొలస విద్యార్థులు రంగోత్సవ్ పోటీల్లో సత్తా చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10న జరిగిన అంతర్జాతీయ రంగోత్సవ పోటీల్లో కొత్త సొలస మండల పరిషత్ (ఏపీ) ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో తమ అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. దీంతో పాఠశాలకి చెందిన ముగ్గురు చిన్నారులు ట్రోఫీలు, మూడు ఇంటర్నేషనల్ మెడల్స్‌తో పాటు సర్‌ప్రైజ్ గిఫ్ట్‌ను సొంతం చేసుకున్నారు. వీటితో పాటు గ్లోబల్ అవార్డ్స్ కూడా లభించాయి. ఈ పురస్కారాలను పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దల చేతులమీదుగా విద్యార్థులకు ప్రదానం చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఝున్నుసాహెబ్ తెలియజేశారు.

స్కూల్‌కు రెండు కంప్యూటర్లు బహూకరణ



బొల్లాపల్లి : మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో గల జడ్పీహెచ్ స్కూల్ పిల్లలకు కంప్యూటర్ విద్యను అభ్యసించడానికి వీలుగా విద్యాదాత పెండాల కోటేశ్వరరావు కుటుంబసభ్యులు రెండు కంప్యూటర్లను బహూకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన పిల్లలను ఉన్నత విద్యను అభ్యసించే విధంగా సహాయసహకారాలు అందిస్తున్న కోటేశ్వరరావు, అమర్, వీబీ మనోజ్‌కుమార్, లలితా కిరణ్మయిలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బొల్లాపల్లి: పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రావులాపురం గ్రామంలో జరిగింది. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుర్గి వెంకట్రామయ్య (19) పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. తండ్రి అబ్రహం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. అనారోగ్య కారణాలతో గతనెల 11న పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎయిమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతిడికి భార్య రాణి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఐటీ ఉద్యోగాలకు కృష్ణవేణి విద్యార్థినులు



నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు విప్రో ఐటీ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విప్రో కంపెనీ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో క్యాంపస్ డ్రైవ్, కమ్యూనికేషన్ లాంగ్వేజ్ పరీక్ష, మార్చిలో టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి శుక్రవారం విడుదల చేసిన ఫలితాలలో తమ విద్యార్థినులు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ నాతాని, టీపీఓ ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

శావల్యాపురానికి రక్షిత నీరు కరువు

- రక్షిత మంచినీటి పథకానికి ఫిల్టర్ బెడ్స్ లేక అపరిశుభ్ర నీరు
- 2006లో మంచినీటి చెరువు పథకం ప్రారంభం
- నూతన పైపులైన్లు అవసరం



శావల్యాపురం మంచినీటి చెరువు

శావల్యాపురం: మండల కేంద్రంలో గుక్కెడు మంచి నీటి కోసం జనం అవురావురమంటున్నారు. ఇక్కడ తాగునీటిని సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకానికి ఫిల్టర్‌బెడ్స్ లేకపోవడం వల్ల గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వాలు పాలకులు మారిన రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి పూర్తిస్థాయిలో నోచుకోలేదు. 2006లో కొత్తలూరు రహదారిలో 8 ఎకరాల పరిధిలో మంచినీటి చెరువును నిర్మించారు. అలాగే గ్రామంలోని ఎంపీపీ స్కూలు పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. రక్షిత మంచినీటి పథకం ప్రారంభించి సంవత్సరాలు గడుస్తోంది. అదే విధంగా అప్పట్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు నేడు శిథిలావస్థకు చేరటంతో తరుచూ విద్యుత్ మోటార్లు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి.

గ్రామ జనాభా ఆధారంగా ఇంటింటికీ నీటి కుళాయిలు, వీధి కుళాయిలు ఏర్పాటు చేశారు. కొంత కాలం కమిటీ పర్యవేక్షణలో పథకం నిర్వహించారు. రానురాను పథకం నిర్వహణ భారంగా మారటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పంచాయతీకి అప్పగించారు. ప్రారంభంలో రూ.20 రూపాయలు వసూలు చేయగా ప్రస్తుతం రూ.100కు ఒక్కో కుళాయి వసూలు చేస్తున్నారు.

గతంలో 450 కుళాయిలు ఉండగా ఒక్కో కుళాయికు నెలకు రూ. 100 రూపాయలు చొప్పున వసూలు చేశారు. ప్రస్తుతం 250 నీటి కుళాయిలు మాత్రమే నెలవారీ వసూలు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు తెలిపారు. మంచినీటి పథకం నిర్వహణతో పాటు నెలవారీ వసూలు చేయటానికి ఉదయం-సాయంత్రం సమయాల్లో గ్రామంలోని తాగునీరు విడుదల చేయడానికి ప్రత్యేకంగా వ్యక్తిని పంచాయతీ వారు నియమించారు. అయితే వసూలు అవుతున్న నగదు నీటి సరఫరా చేయు వ్యక్తికి, నెలవారీ విద్యుత్ బిల్లు, పథకానికి వస్తున్న మరమ్మతులకు కూడా నగదు పూర్తిస్థాయిలో సరిపోవటం లేదు. అక్రమ కనెక్షన్లు నియంత్రణ చేయలేకపోవటం వల్ల ఆర్థికంగా పథకం నిర్వహణ భారంగా మారింది.

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ బకాయి రూ.20 లక్షలు వరకు చెల్లింపులు జరిగాయి. అలాగే ఫిల్టర్ బెడ్స్ నిర్మాణ పనులు, అదనంగా మరో ఓవర్‌హెడ్ ట్యాంకు కోసం తదితర అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 లక్షలు అంచనాలు వేసినా ఫలితం లేదు. దీనికితోడు అనధికార నీటి కుళాయిలపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడింది.

ప్రస్తుతానికి రక్షిత మంచినీటి పథకం ద్వారా విడుదల అవుతున్నా సాగర్ జలాలు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని, తాగు నీటికి పనికి రాకపోవటం వల్ల ప్రవేటు మినరల్ వాటర్ 20 లీటర్ల క్యాను రూ. 10 రూపాయలు కొనుక్కనే పరిస్థితి నెలకొని ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు గ్రామ జనాభాకు విడుదలవుతున్న నీరు సరిపోవటం లేదు. అదనంగా మరో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఆవశ్యకత ఉంది. సంబంధిత అధికారులు స్పందించి శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంటనే శుద్ధి చేస్తాం

వాటర్ గ్రిడ్ పథకం ద్వారా శావల్యాపురం మంచినీటి పథకాన్ని ఎంపిక చేసి ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

– రాచవేల్పూల కుమార్‌రాజా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, వినుకొండ

తాగేనీరు ఫిల్టర్ కావటం లేదు



రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తోంది. పథకం నుంచి విడుదల అవుతున్నా సాగర్ జలాలు ఫిల్టర్ కావటం లేదు. నెలవారీ రూ.100 రూపాయలు మాత్రం పంచాయతీ వారు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

–కె.వి.ఆర్.మోహన్‌చందు, శావల్యాపురం

మరో ట్యాంకు ఏర్పాటు చేయాలి



ఎస్టీ కాలనీలో రైల్వే గేటు సమీపంలో అదనంగా మరో ఓవర్ హెడ్ ట్యాంకును ఏర్పాటు చేయాలి. ఫిల్టర్ బెడ్స్ కూడా ఏర్పాటు చేయాలి. పథకం అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఉంది.

–పోట్లూరు మల్లిఖార్జునరావు, శావల్యాపురం

అందరూ బాగున్నారా అమ్మా?



నరసరావుపేట: బర్డ్‌ఫ్లూ మరణం చోటుచేసుకున్న బాలయ్యనగర్‌లో వైద్యశాఖ అధికారులు ప్రతిరోజూ చేస్తున్న ఇంటింట సర్వే శనివారం కూడా కొనసాగించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటికీ తిరిగి జ్వరపీడితులు, అనారోగ్యంతో ఉన్నవారి వివరాలను సేకరించారు. బర్డ్‌ఫ్లూతో పెండ్యాల గోపీ, జ్యోతీల కుమార్తె రెండేళ్ల ఆరాధ్య మృతిచెందటం, కేంద్ర బృందం ఆ ఇంటిని పరిశీలించిన విషయం విదితమే.

రహదారి నిబంధనలు పాటించాలి

చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు



యడ్లపాడు: వాహనాలతో రోడ్లపైకి వచ్చే ప్రతి ఒక్కరికి రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలని చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు తెలిపారు. మండల పరిధిలో తిమ్మాపురం బైపాస్ వంతెన వద్ద వాహన చోదకులకు శనివారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించారు.

ఈశ్వర్‌లో కియో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఏపీఐటీఏ) ఆధ్వర్యంలో కియో మోటర్స్ సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. వివిధ కళాశాలలకు చెందిన దాదాపు 323 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికలకు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ఉమాశంకర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కంపెనీ విధి విధానాలను తెలియజేశారు. విద్యార్థులకు వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి 93మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఏపీఐటీఏ డైరెక్టర్ సత్యరత్నం, జిల్లా కోఆర్డినేటర్ రోశిరెడ్డి, అకడమిక్ మేనేజర్ డాక్టర్ జనార్ధన్‌లు ఎంపికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి షేక్ కరీమ్ మొహిద్దీన్ మాట్లాడుతూ అంతర్జాతీయ అత్యున్నత కంపెనీలో ఒక్కటైన కియో సంస్థ తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి, మేనేజింగ్ డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన వారితో కియో ప్రతినిధులు

రాములోరి కల్యాణానికి చలువ పందిళ్లు

నరసరావుపేట ఈస్ట్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీసీతారాముల కల్యాణానికి పట్టణంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. వీటితో పాటు పట్టణంలోని పలు కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయం, శ్రీ సీతారామాలయం, వడియరాజుల బజార్‌లోని రామాలయం, సత్తెనపల్లిరోడ్డులోని శ్రీరామచంద్రాలయంతో పాటు పలు వైష్ణవాలయాలలో ఆదివారం శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు.



సత్తెనపల్లిరోడ్డులో ఏర్పాటు చేసిన చలువ పందిరి

గడ్డివాములు దగ్ధం

నూజెండ్ల: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనలో 2 లక్షల విలువైన 10 ఎకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పోలం సీతారామరాజు, గుండాల మస్తానమ్మ లకు గడ్డివాములు ప్రక్క ప్రక్కనే ఉంటాయి. మధ్యాహ్న సమయంలో మంటలు రావటంతో చుట్టుప్రక్కల వారు చూసి సమాచారం అగ్నిమాపక కేంద్రానికి తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో మంటలను అర్పటంతో చుట్టుప్రక్క గడ్డివాములకు వ్యాపించకుండా ప్రమాదం తప్పింది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మోడల్ పాఠశాలలో అగ్నిప్రమాదం

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్ల మోడల్ పాఠశాలలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పాఠశాల ఆవరణ లో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వాటికున్న విద్యుత్ తీగలు వ్రేలాడుతూ ఒకదానికొకటి రాసుకుని నిప్పు రవ్వలు రాలటంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుందని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఆవరణలో పిచ్చిమొక్కలు ఉండటం, వేసవి కాలం కావటంతో అవి ఎండిపోయి మంటలు త్వరగా వ్యాప్తి కావటానికి కారణమైందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాల ఆవరణలో యాజమాన్యం పర్యవేక్షణ కరువైందని విమర్శలొస్తున్నాయి.



పాఠశాలలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశం

యడ్లపాడులో నేటి సాంస్కృతిక కార్యక్రమాలు

యడ్లపాడు: సుందరయ్య కళానిలయం ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించే కార్యక్రమాలు ఇలా ఉన్నాయి. రాత్రి 7:30లకు తాకబత్తుల వెంకటేశ్వరరావు రచనకు అమృత, లహరి దర్శకత్వం వహించిన అమృతలహరి థియేటర్స్(గుంటూరు) వారి 'నాన్న నేను వచ్చేస్తున్నా' నాటిక. 8:30లకు శ్రీ స్నిగ్ధ రచనకు, టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించిన మైత్రి కళానిలయం(విజయవాడ) వారి 'బ్రహ్మ స్వరూపం' నాటిక. 9:30లకు స్వర్గీయ పీవీ భవానిప్రసాద్ రచనకు, జరుగుల రామారావు దర్శకత్వం వహించిన మానవత(యడ్లపాడు) వారి 'బావా ఎప్పుడు వచ్చితివి' నాటిక. ప్రతిప్రదర్శన చివరన లక్కీడ్రా తీసి 10 మంది ప్రేక్షకులకు బహుమతులు ఇస్తారు. నాటికలోని ఆర్టిస్టులందరికీ బహుమతులు, లేడీ ఆర్టిస్టులకు ఆడపడుచు లాంఛనాలు. 10.30 గంటలకు బహుమతి ప్రదానోత్సవం. వేదిక సభ్యులు ముత్తవరపు రామారావు అధ్యక్షతన హైదరాబాద్ శేరిలింగంపల్లి పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఏఎన్‌యూ వైస్‌చాన్స్‌లర్ కె.గంగాధరరావు, మాజీఎమ్మెల్సీ ఎం.లక్ష్మణరావు, సినీ నటులు అజయ్‌ఘోష్, సినీ, టీవీనటులు శ్రీరామ్ తదితరులు హాజరై గెలుపొందిన నాటికలు, ఉత్తమ కళాకారులకు బహుమతుల్ని అందజేస్తారు.



సుందరయ్య కళావేదిక

పేటలో యువకుడు ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని గుండయ్య తోటకు చెందిన గేరా సరళకు ఇద్దరు కుమారులు. వీరిలో రాజశేఖర్ ఉన్నత విద్యకి విదేశాలకు వెళ్ళగా, అతని కుటుంబంతో కలిసి తల్లి చిన్న కుమారుడు రాజేష్ ఉంటున్నారు. ఓ గ్రాఫిక్స్ షాప్ లో పనిచేసే రాజేష్ భావనారుషి నగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈనెల 3న తల్లితో మాట్లాడిన రాజేష్ ఆ తర్వాత కనిపించలేదు. అయితే గుండె తోటలోని అద్దె ఇంటి ఇరుగుపొరుగు ఇంటి నుంచి వాసన రావడంతో తల్లి సరళకు సమాచారం అందించారు. దీంతో శనివారం అక్కడకువెళ్లి తలుపు తీయగా తన చిన్న కొడుకు రాజేష్ (24) ఫ్యానుకు ఉరి వేసుకొని విగతాజీవిగా మారి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుతున్న పోలీసులు రెండు రోజుల క్రితమే ఉరివేసుకొని ఉండవచ్చని ప్రాథమిక విషయాల్లో చేర్చారు తల్లి చర్ల ఫిర్యాదుతో మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావలసి ఉంది.

రేషన్ షాపుల తనిఖీ

వినుకొండ: ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభమైనందున జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వినుకొండ పట్టణం, మండలంలోని పలు రేషన్ షాపులను తహసీల్దార్ సురేష్‌నాయక్ తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్ వివరాలను పరిశీలించి రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని రేషన్‌డీలర్లను ఆదేశించారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

- సేవలు స్మరించుకున్న అభిమానులు
- ఆయన జీవితం ఆదర్శనీయం: డీఈఓ

నరసరావుపేట ఈస్ట్: నిరుపేద కుటుంబంలో జన్మించి దేశంలో అత్యున్నత పదవులను అలంకరించిన మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. కేబీఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న పది మూల్యాంకన కేంద్రంలో శనివారం డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



నరసరావుపేటలో నివాళులర్పిస్తున్న డీఈఓ చంద్రకళ, ఉపాధ్యాయులు

...యుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని... సమాజానికి సేవ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

నరసరావుపేట: స్థానిక గుంటూరురోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దేశ మాజీ ఉపప్రధాని, సమతావాది డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: బాబు జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల బాటలో పయనిద్దామని .. నేటితరం యువత విద్యార్థులు మహనీ...

వివిధ సంఘాల ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

12 మంది రక్తదానం

నరసరావుపేట: దేశ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని శనివారం చైతన్య మాదిగ శక్తి అధ్యక్షుడు కుంపటి రవి సహకారంతో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 12 మంది రక్తదానం చేశారు.



నరసరావుపేటలో నివాళులు అర్పించిన వైఎస్సార్ సీపీ నాయకులు



వినుకొండలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

నరసరావుపేట: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో దేశ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు జి.అలెగ్జాండర్ సుధాకర్ జగజ్జీవనరామ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు.



చిలకలూరిపేటలో విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వినుకొండలో...

వినుకొండ: భారత ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

చర్చి ఆఫ్ క్రీస్ట్ సంస్థ ఆధ్వర్యంలో..

వినుకొండ చర్చి ఆఫ్ క్రీస్ట్ సంస్థ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొటెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస రెడ్డి, సంస్థ అధ్యక్షులు ఎం.డి.రాజు, ప్రవళిక, రమేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాదెండ్ల: బడుగు బలహీన వర్గాల్లో సుస్థిర స్థానం సాధించుకున్న మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు నాదెండ్ల శాఖ గ్రంథాలయంలో శనివారం జగజీవన్ రామ్ జయంతిని నిర్వహించారు

భిక్షాటనతో పారిశుద్ధ్య కార్మికుల నిరసన

- 17వ రోజుకు సమ్మె
- కనీస వేతనాలు, అన్ని పని దినాలకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్

నరసరావుపేట: తమకు పూర్తినెల జీతాలు చెల్లించాలంటూ గత 17రోజులుగా శిబిరం నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు శనివారం పట్టణంలోభిక్షాటన చేసి వినూత్నంగా నిరసన తెలియచేశారు. సమ్మె శిబిరంలో స్వాతంత్ర్య సమరయోధులు తొలి భారత ఉపప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న వారికి జీతాలు సరిగా ఇవ్వకపోగా అడిగిన వారిపై వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కుల, సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా నిలబడి దళితులు పేదల పక్షాన నిలబడి పోరాడిన నాయకుడు జగజ్జీవన్ రామ్ స్ఫూర్తితో మున్సిపల్ కార్మికులు తమ వేతనాల విషయంలో జరుగుతున్న వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. 40 మంది కార్మికుల పేర్లు ఆప్కాస్‌లో నమోదైనా బదిలీ కార్మికులంటూ సగం నెల జీతమే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యలపై కలెక్టర్, ఎమ్మెల్యేకు విన్నవించినా నిర్లక్ష్యం చేయడం తగదని విమర్శించారు.



భిక్షాటన చేస్తున్న కార్మికులు

కేజీబీవీలో నోట్‌బుక్స్ పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవి)లో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలకు శనివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎం.ప్రమీల రాణి మాట్లాడుతూ, ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఈనెల 11వ తేదీ వరకు 6, 11 తరగతులలో చేరగోరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు ౖ ఇజుజ ఖీౖ ఇభిజట ట.జీ ష వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వృద్ధుడు ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: పురుగుమందు సేవించి వృద్ధుడు మృతిచెందిన ఘటన ఉప్పలపాడు రోడ్డులో శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన మేదరమెట్ల గోవిందయ్య(70) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి వచ్చిన గోవిందయ్య ఉప్పలపాడు రోడ్డులో వై జంక్షన్ సమీపంలోని సరస్వతి అమ్మవారి ఆలయం సమీపంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ కిశోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టమార్టమ్ నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.